నమస్తే తెలంగాణ | DISTRICT SUPPLEMENT

# వికారాబాద్

బుధవారం 25 అక్టోబర్ 2023
WEDNESDAY, OCTOBER 25, 2023
VIKARABAD
పేజీలు PAGES : 12

- జిల్లాలో ఒక్క నియోజకవర్గానికీ అభ్యర్థులను ప్రకటించని బీజేపీ
- వికారాబాద్, కొడంగల్ నియోజకవర్గాల్లో పోటీకి పక్క జిల్లాల లీడర్లపై దృష్టి
- తాండూరు నుంచి పోటీ చేయాలంటూ ఒత్తిడి తెస్తున్నా విముఖత చూపుతున్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డి
- పరిగి నియోజకవర్గ టికెట్ కోసం స్థానికేతరుని ప్రయత్నాలు

8



నాలుగు నియోజకవర్గాల్లోనూ బీజేపీ పోటీ నామమాత్రమే

## ఫస్ట్ లిస్ట్‌లో
# నో చాన్స్

### అభ్యర్థుల కోసం బీజేపీ వెతుకులాట

సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో కారు స్పీడు పెంచగా, ఇంకా అభ్యర్థులు దొరకక ప్రతిపక్షాలు చతికిల పడ్డాయి. ఇటీవల బీజేపీ ప్రకటించిన ఫస్ట్ లిస్ట్‌లో జిల్లాలోని ఒక్క నియోజకవర్గానికీ అభ్యర్థిని ప్రకటించలేదు. డిపాజిట్ కూడా దక్కించుకోలేని వారు దరఖాస్తులు చేసుకోగా పెండింగ్‌లోనే పెట్టింది. సరైన పోటీనిచ్చే అభ్యర్థులు లేక బీజేపీ అధిష్ఠానం అయోమయంలో పడింది. క్యాడర్, నాయకులు లేని బీజేపీ.. వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్ నియోజకవర్గాల్లో పోటీ నామమాత్రమేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మాజీ మంత్రి ఏ.చంద్రశేఖర్ బీజేపీ తరపున వికారాబాద్ నియోజకవర్గంలో బరిలో ఉంటాడని భావిస్తే ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరి జహీరాబాద్ నియోజకవర్గం నుంచి పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నారు. దీంతో బీజేపీకి అభ్యర్థుల వెతుకులాట తలనొప్పిగా మారింది. తాండూరు నియోజకవర్గం నుంచి మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని బరిలోకి దింపాలని యోచిస్తున్నా ఆయన విముఖత వ్యక్తం చేస్తున్నట్లు తెలిసింది. పరిగి నియోజకవర్గం నుంచి భునేటి కిరణ్‌కు టికెట్ వచ్చే అవకాశాలున్నా స్థానికేతరుడు కాబట్టి డిపాజిట్ దక్కడం కూడా కష్టమే. కొడంగల్ నియోజకవర్గంలోనూ బీజేపీ పోటీ నామమాత్రంగానే ఉండనున్నట్లు సమాచారం.

– వికారాబాద్, అక్టోబర్ 24 (నమస్తే తెలంగాణ)





- జిల్లావ్యాప్తంగా 636 గ్రామ మహిళా సమాఖ్యలు
- మహిళా సమాఖ్య సంఘాలకు సొంత భవనాల నిర్ణయాలపై ఎస్‌హెచ్‌జీల హర్షం
- గ్రామీణ ప్రాంత మహిళల ఆర్థిక వృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు
- బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి కింద ఎస్‌హెచ్‌జీలకు రూ.వేల కోట్ల రుణాలు
- ఏటా లక్ష్యానికి మించి ఎస్‌హెచ్‌జీలకు రుణాలు
- తొమ్మిదేండ్లలో రూ.2112 కోట్ల రుణాలు మంజూరు
- స్వయం ఉపాధికై రూ.లక్ష నుంచి రూ.4 లక్షల వరకు రుణాలు
- ఎస్‌హెచ్‌జీలు ఎంపిక చేసుకున్న వ్యాపారంలో మెళకువలపై ప్రభుత్వం ఆధ్వర్యంలో శిక్షణ

## మహిళా సమాఖ్యలకు
# సొంత భవనాలు

**మన కోసం మ్యానిఫెస్టో**

మహిళల సంక్షేమం, ఆర్థిక అభ్యున్నతికి తెలంగాణ ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నది. వారు ఆర్థికంగా ఎదగాలన్న సదుద్దేశంతో విలేజ్ ఎంటర్‌ప్రైజెస్ కార్యక్రమం కింద రుణాలను ఇస్తున్నది. బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి కింద రుణాలను మంజూరు చేస్తూ ఆర్థిక వృద్ధికి తోడ్పాటునందిస్తున్నది. ఏటా నిర్దేశించిన లక్ష్యానికి మించి స్వయం సహాయక సంఘాలకు రుణాలను మంజూరు చేస్తున్నది. బీఆర్‌ఎస్ మ్యానిఫెస్టోలో మహిళా సమాఖ్య సంఘాలకు సొంత భవనాలను నిర్మిస్తామని ప్రభుత్వం హామీనివ్వడంపై హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలో గ్రామ మహిళా సమాఖ్యలు 636 ఉండగా, 50 గ్రామ మహిళా సమాఖ్యలకు మాత్రమే సొంత భవనాలు ఉన్నాయి. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటివరకు ఎస్‌హెచ్‌జీలకు రూ.2112 కోట్ల రుణాలను అందజేయడంతోపాటు వడ్డీ డబ్బులనూ ఏటా మాఫీ చేస్తూ వస్తున్నది. ఒక్కో సభ్యురాలికి రూ.లక్ష నుంచి రూ.4 లక్షల వరకు రుణాలను మంజూరు చేయగా, జిల్లాలో ఇప్పటివరకు 2500 మంది స్వయం సహాయక సంఘాల సభ్యులు వ్యాపారులుగా మారారు. ప్రస్తుత మ్యానిఫెస్టోలో మహిళలకు ప్రాధాన్యం ఇవ్వడంతో బీఆర్‌ఎస్ అభ్యర్థులు ఏ గ్రామానికి వెళ్లినా హారతులు పడుతున్నారు.

– వికారాబాద్, అక్టోబర్ 24 (నమస్తే తెలంగాణ)

సెంటర్ స్ప్రెడ్‌లో..



## ఎలక్ట్రానిక్ హబ్
# @కొంగరకలాన్

- రంగారెడ్డి జిల్లాకు మరో ఎలక్ట్రానిక్ పరిశ్రమ
- ఫాక్స్‌కాన్ తరహాలో కొంగరకలాన్‌లోనే కేన్స్ సెమికాన్
- రూ.3000కోట్లతో స్థాపించనున్న కంపెనీ
- త్వరలో ఎలిమినేడులోనూ మరో పరిశ్రమ

8

రంగారెడ్డి జిల్లాలోని కొంగరకలాన్ ఎలక్ట్రానిక్ హబ్‌గా మారనున్నది. కలెక్టరేట్ సమీపంలో ఇప్పటికే చైనాకు చెందిన ప్రతినిధులు రూ.4,634కోట్లతో ఫాక్స్‌కాన్ సంస్థను ఏర్పాటు చేయగా, రూ.3000కోట్ల పెట్టుబడితో బెంగళూరుకు చెందిన పారిశ్రామికవేత్తలు కేన్స్ సెమికాన్ అనే మరో ఎలక్ట్రానిక్ సంస్థను ప్రారంభించారు. మంగళవారం టీఎస్ఐఐసీ ఎండీ వెంకటనర్సింహారెడ్డి, రాచకొండ పోలీసు కమిషనర్ దేవేంద్రసింగ్‌చౌహాన్‌తో కలిసి భూమిపూజ చేశారు. త్వరలోనే ఎలిమినేడులోనూ మరో ఎలక్ట్రానిక్ సంస్థ ఏర్పాటు కానున్నది. కేన్స్ సెమికాన్ పరిశ్రమలో అనేకరకాల ఎలక్ట్రానిక్ పరికరాలను తయారు చేయనున్నారు. ఇప్పటికే కంపెనీల ఏర్పాటు వల్ల ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్షలాది మందికి ఉపాధిలభిస్తుండగా, కేన్స్ సెమికాన్‌లో వెయ్యి మందికి పైగా ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

- ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 24



కేన్స్ సెమికాన్ పరిశ్రమ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ప్రతినిధులు